క్లుప్తంగా

బంగారు బాల్యానికి శ్రీకారం

దొనకొండ: స్థానిక కస్తూరిబా గురుకుల పాఠశాలలో మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్‌బాషా ఆధ్వర్యంలో బంగారు బాల్యానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు ఉన్న హక్కులు వినియోగించుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయవద్దని, 18 సంవత్సరాల వరకు విద్యను కొనసాగించాలని సూచించారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలు వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీ హెచ్ రూతు మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు చిన్న వయసులో పెళ్లి చేసుకుంటే రక్త హీనత, అవయవాలు సరిగా పని చేయక పోవటం, జన్మించిన బిడ్డ అంగవైకల్యం లోపించటం జరుగుతుందన్నారు.

108 సిబ్బంది వినతిపత్రం

పెద్దదోర్నాల: రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న 108 కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 108 సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అరబిందో యజమాన్యం 108 సిబ్బంది సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నవంబర్ 25 తర్వాత సమ్మె చేపట్టనున్నట్లు ప్రకటించారు.

నేడు తాలూకా క్లబ్ షాపింగ్ గదులకు బహిరంగ వేలం

దర్శి: స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లోని పీజీఎస్ ది తాలూకా క్లబ్ షాపింగ్ గదులకు శనివారం ఉదయం 9 గంటలకు బహిరంగ వేలం వేస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు మేడం మోహన్‌రెడ్డి, దారం వాసుదేవరెడ్డి, దారం సుబ్బారావులు ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనే వారు ముందుగా నాన్ రిఫండబుల్ పైకం రూ.10 వేలు చెల్లించాలన్నారు. పాడిన వెంటనే క్లబ్‌నకు 50 శాతం నగదు చెల్లించాలన్నారు. అలా చెల్లించకుంటే పాట రద్దు చేస్తామని హెచ్చరించారు. షాపుల్లో మాంసం, మద్యం, పేలుడు పదార్థాలు, హోటల్ నిర్వహించరాదన్నారు. మూడేళ్లకు ఒకసారి 20 శాతం అద్దె పెంచుతామని చెప్పారు. నియమ నిబంధనలు పాటించని అద్దెదారులను తొలగించి ఆ గదికి మళ్లీ వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి నెలా 3వ తేదీలోపు అద్దె సక్రమంగా చెల్లించాలన్నారు.

కొండచిలువ కలకలం



నూజెళ్లపల్లిలో కొండచిలువ

ముండ్లమూరు (దర్శి): మండలంలోని నూజెళ్లపల్లిలో శుక్రవారం కొండ చిలువ ప్రత్యక్షమై కలకలం రేపింది. కొండచిలువను గుర్తించి స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగానే ఎఫ్‌బీఓ అమరా ఆ ప్రాంతానికి వచ్చి కొండచిలువను చాకచక్యంగా పట్టుకున్నారు. బోన్‌లో బంధించి అడవిలో వదిలేశారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరులో బంగారయ్య హోటల్ ఎదుట రోడ్డుపై కొండ చిలువ ప్రత్యక్షమైంది. స్థానికులు సచివాలయం సిబ్బందికి తెలియజేశారు. వారు అటవీ శాఖ ద్వారా కొండ చిలువను బంధించి అడవిలో వదిలేశారు.

నిధుల పేరుతో నాటకం

- పక్కా భవనం నిర్మిస్తామంటూ గ్రంథాలయ సంస్థ మోసం
- టీడీపీ పాలనలో పంచాయతీ స్థలం పక్కా రిజిస్ట్రేషన్
- నేటికీ ఆ స్థలంలో నిర్మాణానికి నోచుకోని గ్రంథాలయం
- ఇప్పటికీ పంచాయతీ కార్యాలయంలోని చీకటి గదిలోనే గ్రంథాలయం



గ్రంథాలయం నిర్వహిస్తున్న చీకటి గది



గ్రంథాలయానికి పంచాయతీ రిజిస్టర్ చేసిన స్థలం ఇదే..

కురిచేడు: అంతా అయిపోయింది.. వండి వార్చేశాం .. తినడమే తరువాయి.. ఆలస్యమైతే ఆరిపోతుందని టీడీపీ పాలనలో హడావుడి సదా మామూలైంది. ఎనిమిదేళ్ల క్రితం టీడీపీ పాలనలో మండల కేంద్రం కురిచేడుకు గ్రంథాలయ భవనం మంజూరైంది. స్థలం ఇస్తే వెంటనే నిర్మాణం చేపడతామని జిల్లా గ్రంథాలయ సంస్థ హడావుడి చేసింది. అప్పటి వరకు కురిచేడులోని ఓ ప్రైవేటు భవనంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో స్థలం చూపకపోతే గ్రంథాలయాన్ని ఎత్తేస్తామని బెదిరింపులకు దిగింది. అప్పటి సర్పంచ్ పోతిరెడ్డి నాగిరెడ్డి గ్రామ సర్వే నంబర్ 182/1లో ఎ 0.3.60 సెంట్లు స్థలం గ్రంథాలయానికి ఇచ్చే విధంగా 2016 మేలో పంచాయతీ తీర్మానం చేసి జూలై 26వ తేదీన దర్శి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్టర్ చేశారు. గ్రంథాలయానికి ఎవరూ భవనం అద్దెకు ఇవ్వక పోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఓ గదిలో నాటి నుంచి నేటి వరకు గ్రంథాలయం నిర్వహిస్తున్నారు.

స్థలాలున్నా నిర్మాణాలు సున్నా

జిల్లాలో మొత్తం 66 గ్రంథాలయ శాఖలుండగా 30 శాఖలకు సొంత భవనాలున్నాయి. 21 గ్రంథాలయ శాఖలు అద్దెలు లేకుండా ఉచిత భవనాల్లో నిర్వహిస్తున్నారు. 15 గ్రంథాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ శాఖలో 105 పోస్టులుండగా కేవలం 35 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 70 ఖాళీలు నేటికీ పేరుకు పోయి ఉన్నాయి. జిల్లాలోని దర్శి, తాళ్లూరు, కురిచేడు, మల్లవరం, కొమరోలు, సంతమాగులూరు, ఆకవీడు, పామూరు మండలాల్లో గ్రంథాలయాలకు స్థలాలు ఉన్నాయి. అయినా ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి, వాటికి సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయక పోవడంతో గ్రంథాలయ శాఖ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇప్పటికైనా ప్రభుత్వం సొంత స్థలాలు ఉన్న మండలాల్లో గ్రంథాలయాలకు సొంత భవనాలు నిర్మించి ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేసి గ్రంథాలయాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాజీ సీఎం జగన్‌తో వైఎస్సార్ సీపీ నేతల భేటీ



వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌తో వైఎస్సార్ సీపీ నాయకులు

దర్శి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముండ్లమూరు ఎంపీపీ సుంకర సునీతా బహ్మానందరెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు గొంగటి శ్రీకాంత్‌రెడ్డి, తాళ్లూరు మాజీ ఎంపీపీ పోశం మధుసూదన్‌రెడ్డిలు శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు. తమకు అండగా ఉంటూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారని, అందరికీ అందుబాటులో ఉంటూ అండగా ఉన్నారని జగన్‌మోహన్‌రెడ్డితో నాయకులు చెప్పారు. సోషల్ మీడియా కార్యకర్తలకు అండగా ఉంటామని జగన్ భరోసా ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడితే మంచి పంటలు

కురిచేడు: భూసార పరీక్షలు చేయించుకుంటూ నేల ఆరోగ్యం కాపాడితే మంచి పంటలు సాధించవచ్చని డీఆర్‌సీ వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ తెలిపారు. మండలంలోని పెద్దవరం, ఎస్ఎస్‌పీ అగ్రహారం గ్రామాల్లో శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం ఆర్‌కేవీవై రఫ్ తార్ పథకం కింద రైతులకు ఉద్యానవన పంటలు, వ్యవసాయ పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ఫలితాల కార్డుల గురించి వివరించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి, వరి, కంది, శనగ, మినుము, పత్తి, పొగాకు, మిరప పంటల్లో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు మాట్లాడుతూ వ్యవసాయశాఖ ద్వారా అమలు జరుగుతున్న పథకాలు, ఈ-పంట, పంటల బీమా ప్రాముఖ్యం గురించి వివరించారు. వీఏఏలు సౌమ్య, అనురాధ, వెంకటేశ్వర్లు, ఆత్మ బీటీఎం నాగభూషణం పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

- సబ్ కలెక్టర్‌కు కుమ్మరి కాలనీ వాసుల విన్నపం



కార్యదర్శితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాథ్

పెద్దదోర్నాల: దీర్ఘకాలంగా తమ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండల కేంద్రంలోని కుమ్మరి కాలనీ వాసులు సబ్ కలెక్టర్ సహజిత్ వెంకట త్రివినాథ్‌కు విన్నవించుకున్నారు. శుక్రవారం దర్తీ అభా భగవాన్ ముండా 150 జయంతిలో పాల్గొని తిరిగి వెళ్తున్న ఆయన్ను కుమ్మరి కాలనీ వాసులు కలిసి తమ ఇబ్బందులు మొరపెట్టుకున్నారు. తమ కాలనీతో పాటు దర్గా వీధి తదితర ప్రాంతాలకు నెల రోజుల నుంచి నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని వారు సబ్ కలెక్టర్‌కు మొరపెట్టుకున్నారు. తమ కాలనీకి సంబంధించి ఎటువంటి పంచాయతీ వాటర్ పైపులైన్లు లేవని, కేవలం ఒక్క డీప్ బోరుతోనే కాలం వెళ్లబుచ్చుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బోరు మరమ్మతులకు గురైతే మాత్రం తమకు నీటి ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు. దర్గా వీధికి సంబంధించి ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుతో పాటు కుమ్మరి కాలనీకి సంబంధించి మరో కొత్త బోరు ఏర్పాటు చేసి తమ కాలనీలో దీర్ఘకాలంగా ఉన్న నీటి సమస్యను తొలగించాలని కోరారు. దీంతో పాటు తమ కాలనీ నుంచి పట్టణానికి చెందిన మురుగునీరు ప్రవహిస్తోందని, వాటికి ప్రత్యేకంగా కాలువలు ఏర్పాటు చేసి దుర్వాసన లేకుండా చేయాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావును నీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రభుత్వ భూములపై విచారణ

పెద్దారవీడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులను ఒంగోలు ఆర్డీఓ కె. ప్రసన్నలక్ష్మి శుక్రవారం పరిశీలించారు. గతంలో రెవెన్యూ అధికారులు విధులు నిర్వహిస్తున్న సమయంలో పెద్దారవీడులో ప్రభుత్వ భూములను ఇతరులకు ఆన్‌లైన్‌లో రెవెన్యూ అధికారులు నమోదు చేశారని గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెల్సిందే. కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ప్రత్యేక విచారణ నేపథ్యంలో భూముల రికార్డులు పరిశీలించి గతంలో విధులు నిర్వహించిన రెవెన్యూ అధికారులు, ఫిర్యాదు ఇచ్చిన వారిని విచారించారు. ఆమె మాట్లాడుతూ నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

పొలం దారి తగాదాలో ఒకరికి గాయాలు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్రీను

యర్రగొండపాలెం: పొలం దారి విషయంలో జరిగిన వివాదంలో ఒకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గడ్డమీదిపల్లెలో శుక్రవారం జరిగింది. వివరాలు.. వన్నెబోయిన శ్రీను తన పొలానికి వెళ్లే దారిలో అడ్డంగా గుంత తీశాడు. గుంతను ఆయన పూడ్చించి దారి చేసుకున్నాడు. దారిలో గుంత తీసిన సాగనబోయిన సుబ్బారావు తన ఇద్దరు భార్యలు వెంకటమ్మ, అల్లూరమ్మ, కుమారుడు వినోద్, కుమార్తె కౌసల్యలు ఒక పథకం ప్రకారం గొడ్డలి, కారం తమ వెంట పొలం వద్దకు తీసుకొచ్చి జేసీబీతో గుంతను పూడ్చిస్తున్నారు. ఇదేమిటని శ్రీను అడిగిన వెంటనే తమ వెంట తీసుకొచ్చిన కారం అతని కళ్లల్లో చల్లి గొడ్డలితో దాడి చేశాడు. గొడ్డలి గాయంతో కింద పడిపోయిన శ్రీను మృతి చెందాడని నిందితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన శ్రీను యర్రగొండపాలెంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చౌడయ్య తెలిపారు.

రోడ్డు నిర్మాణం ఆపేయండి

కురిచేడు: స్థానిక యోగయ్య మఠం నుంచి అట్లపల్లి చెరువుకు వెళ్లే దారి (పాత అగ్రహారం దారి)కి వేస్తున్న సిమెంటు రోడ్డును ఆపేయాలని పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ప్రధాన రోడ్డు నుంచి అట్లపల్లి చెరువు రోడ్డులో ఆక్రమణలు ఉన్నాయని, వాటిని పరిష్కరించేంత వరకు పనులు తాత్కాలికంగా నిలిపివేయాలని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం వీఆర్వో కేవీ నాగరాజు, సర్వేయర్లు గోపితో కలిసి ఆమె ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

పంచాయతీ రికార్డుల ప్రకారం రోడ్డుకు ఉన్న ఆక్రమణలు తొలగించాల్సి ఉందని ఆమె నిర్ధారించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంపత్‌కుమార్

పుల్లలచెరువు: గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సంపత్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కొత్తూరు, పీవీపల్లిలో సైబర్ నేరాలు, రహదారి భద్రత నియమాలు, చట్టాలపై ప్రజలకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే తీయవద్దని, లాటరీ, కార్లు బహుమతులు వచ్చాయని లింక్ ఓపెన్ చేయండి.. అని మెసేజీలు వస్తుంటాయని, వాటిని తీయవద్దన్నారు. వాటిని ఓపెన్ చేస్తే డబ్బులు ఖాళీ అవుతాయని, ఈ విషయం ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. రహదారి నియమాలు పాటించి వాహనాలు నడపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపి కుటుంబాలను అనాథలు చేయవద్దన్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతారణం ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు వారి పిల్లలు కూడా ఉన్నత చదువులు చదువుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. త్వరలో ప్రతి పంచాయతీలో ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఎస్ఐ సంపత్‌కుమార్ పేర్కొన్నారు.

18న మోడల్ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

యర్రగొండపాలెం: స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని మోడల్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 18వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ బి.విజయకుమారి శుక్రవారం తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడప్, డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జరిగే జాబ్‌మేళాలో ఆక్సిస్ బ్యాంక్, ప్రీమియర్ సోలార్ ఎనర్జీ, ఫ్లిప్‌కార్ట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, 19 నుంచి 29 సంవత్సరాలలోపు నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనవచ్చని, ఎంపికైన వారికి రూ. 15 వేల నుంచి రూ.20 వేల వరకు జీతం పొందే అవకాశం ఉందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు క్వాలిఫికేషన్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, పాన్ కార్డ్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 63022 20609, 70131 82284 నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

గ్రంథాలయ పుస్తక ప్రదర్శన

కురిచేడు: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయ శాఖా కార్యాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. గ్రంథాలయాలను వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కార్యదర్శి చాంద్‌బీ విద్యార్థులకు సూచించారు. గ్రంథపాలకురాలు సుమతి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనకు మంచి స్పందన లభించిందని గ్రంథపాలకురాలు కె.ఝాన్సీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో బి.స్పందన, శ్రీకాంత్, సిద్ధిక్‌లు విజేతలుగా నిలిచారని ఆమె తెలిపారు.

పెద్దారవీడు: పుస్తక పఠనంతోనే విద్యార్థులు విజ్ఞానాన్ని పొందుతారని గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. జాతీయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన చేశారు.

దర్శి: స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు రఘురామయ్య, రమాదేవి, జైలు సూపరింటెండెంట్ వెంకటరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అట్లూరి రమారావులు ప్రారంభించారు. గ్రంథపాలకురాలు వి.విజయకుమారి పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమర యోధుల పోరాటాలను గౌరవించాలి

పెద్దదోర్నాల: స్వాతంత్య్ర సమరయోధుల పోరాటాలను ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సహజిత్ వెంకట త్రివినాథ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ధర్తీ అభా భగవాన్ ముండా 150 జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్య్ర పోరాటంలో ప్రాణాలు ధారపోసిన గిరిజన యోధుడు కుడుముల పెద్దబయ్యన్న, హనుమంతప్పల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సబ్ కలెక్టర్ గిరిజనులకు ఉద్దేశించి మాట్లాడుతూ ఆ నాడు గిరిజనుల స్వేచ్ఛ కోసం పోరాటాలు చేసి ప్రాణత్యాగం చేసిన కుడుముల పెద్దబయ్యన్న, హనుమంతప్పలు గొప్ప పోరాట యోధులని కొనియాడారు. 75 ఏళ్ల స్వాతంత్య్ర పోరాటం తర్వాత కూడా చెంచు గిరిజనులు సామాజిక, ఆర్థిక, విద్యారంగాల్లో అభివృద్ధి సాధించలేక పోయారన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సందేశాన్ని చెంచు గిరిజనులకు వినిపించారు. ఐడీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ సురేష్ కుమార్, డీటీడబ్ల్యూఓ జగన్నాథరావు, హౌసింగ్ ఈఈ పవన్‌కుమార్, బీఎస్ఎన్ఎల్ డీఈ రవికుమార్, ఆర్టీటీ రీజనల్ డైరెక్టర్ నాగరాజు, సర్పంచ్ చిత్తూరి హారిక, ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్, కెనరా బ్యాంక్ మేనేజర్ పాలేటి మురళీకృష్ణ, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నతాధికారులు లేకుండానే చేపల చెరువుకు వేలం

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పసుపుగల్లు చేపల చెరువు వేలంపాటను ఉన్నతాధికారులు లేకుండానే ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శి పాఠెం మౌలాలీ శుక్రవారం వేలం పాట నిర్వహించారు. గ్రామంలో జరిగిన వేలంపాట పాడిన పరిస్థితి చూస్తే ఇదేం వేలపాటని నోళ్లు వెళ్లబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. సిండికేట్‌గా మారి వేలం పాటను పూర్తి స్థాయిలో కుదించేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇదే చేపల చెరువు రూ.46.50 లక్షలకు పాడుకోగా ప్రస్తుతం నిర్వహించిన పాటకు మాత్రం రూ.22.30 లక్షలకు మాత్రమే పాట పాడటంపై పలు అనుమానాలకు తావిస్తోంది. అన్నీ తానై పంచాయతీ సెక్రటరీ వేలం పాట నిర్వహించారు.

అధికారుల దుమ్మా

ఎక్కడ చెరువులు వేలం పాటలు పాడినా ఎంపీడీఓ, ఈఓఆర్డీ, డీఎల్‌పీఓ లేదా డీపీఓ వంటి జిల్లా అధికారి ఒకరు వచ్చి వేలం పాటలు నిర్వహిస్తారు. ఇక్కడ మాత్రం అన్నీ తానై వ్యవహరించడంపై ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడిందని స్థానికులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అందరూ సిండికేట్‌గా మారి ఇతరులు రాకుండా వేలంపాట నిర్వహించారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి పాఠెం మౌలాలీని వివరణ కోరగా పేపర్‌లో ప్రకటనలు ఇచ్చామని, అధికారులు రాకున్నా వేలం నిర్వహించామన్నారు. అధికారులు వచ్చినా రాకున్నా వేలం నిర్వహించే అధికారం తనకు ఉందని చెప్పారు.

సీపీఎం ప్రజాపోరు

ముండ్లమూరు (దర్శి): ప్రజాసమస్యల పరిష్కారానికై తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ముండ్లమూరు మండల కమిటీ సభ్యులు బోడపాటి హనుమంతరావు అధ్యక్షతన శుక్రవారం ధర్నా చేశారు. అధిక ధరలు తగ్గించాలని, మహిళలు, పిల్లలపై అత్యాచారాలు అరికట్టాలని, దళితులు, గిరిజనులపై దాడులు అరికట్టాలని, వెలుగొండ నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని, ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని, జమిలి ఎన్నికలు ఆపాలని, విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయటాన్ని నివారించాలని తదితర డిమాండ్స్‌తో ధర్నా చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ మద్యం, కరెంటు చార్జీలు, మహిళలపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని, గత ప్రభుత్వానికి భిన్నమైన పాలన అందిస్తామన్న కూటమి వాగ్దానాలు అమలులోకి రాలేదని, భవన నిర్మాణ కార్మికులు ఇసుక కొరతతో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ట్రూ అప్ చార్జీల పద్ధతిని, స్మార్ట్ మీటరుల బిగించే ప్రయత్నాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ స్రవంతికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. గాలి వెంకటేశ్వర్లు, గంగినేని సత్యనారాయణ, పంట ఏడుకొండలు, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, ఎలగంటి రవి, నరసింహ, పిచ్చయ్య పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శైవాలయాలు



త్రిపురాంతకం ఆలయంలో ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కురిచేడు: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని శైవాలయాలు శివపంచాక్షరీ మంత్రంతో మార్మోగాయి. వేకువ జామున 4 గంటల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరి దీపాలు వెలిగించారు. స్థానిక శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో పూజారులు కురిచేటి సుబ్బారావు, సుబ్రహ్మణ్యంలు స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం చేశారు. శ్రీ జ్ఞానప్రసూనాంబ దేవికి కుంకుమార్చనలు చేశారు. స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలోని శ్రీ నగేశ్వర స్వామికి ఆలయ పూజారి నారాయణం వెంకటేశ్వర్లు అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పుల్లలచెరువు: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు శుక్రవారం కార్తీకపౌర్ణమి వేడుకల సందర్భంగా శివనామస్మరణతో మార్మోగాయి. కార్తీక పౌర్ణమి కావడంతో భక్తులు వేకువ జామునే స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి దీపపు ఒత్తులు వెలిగించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చాపలమడుగు, ముటుకుల, పుల్లలచెరువు, శతకోడు ఆలయాల్లో భక్తులు విరివిగా పాల్గొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. చాపలమడుగు శివాలయంలో భారీ ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పౌర్ణమి సందర్భంగా తెల్లవారు జాము నుంచి కార్తీక దీపాలు వెలిగించి ఆశ్రమంలో వెలసిన శ్రీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకాలు, మహా నైవేద్య మంగళ హారతులు, శంకు నాదాలతో కార్తీక దీపం మహోత్సవం నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. బైరవానంద స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రికి పౌర్ణమి సందర్భంగా దేవుని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బైరవానందస్వామి తెలిపారు.

వైభవంగా జ్వాలాతోరణం

త్రిపురాంతకం: శ్రీ త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలా తోరణం వైభవంగా జరిగింది. శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తుల ఊరేగింపును భక్తులు నిర్వహించారు. త్రిపురాంతకంలోని శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో జరిగే జ్వాలా తోరణం స్వామి అమ్మవార్ల ఉత్సవం సందర్భంగా పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆకాశ దీపం, అఖండ దీపం వెలిగించారు. ఆలయాల వద్ద కార్తీక దీపాలు వెలిగించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి, శ్రీబాలాత్రిపుర సుందరీదేవి ఆలయాలు భక్తులతో కిక్కిరిసాయి. భారీగా తరలి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. కార్తీక దీపాలు మహిళలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పూజల్లో పాల్గొన్నారు. సామాజిక సత్రాలు వద్ద కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో ఉన్న భక్తులు దర్శనం కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

దర్శి: మండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి అమ్మవారు సమేత శ్రీ కాశీ విశ్వనాథ స్వామి వారి ఆలయంలో తెల్లవారు జామున ఆలయ పూజారి మల్లికార్జున శర్మ రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామావలి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పూట జ్వాలా తోరణాలు వెలిగించారు. ఈ సందర్భగా తెల్లవారు జామునే మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించి తమ భక్తిని చాటుకున్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో..

తెల్లవారు జామున అయ్యప్ప స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులందరికీ అన్నదానం చేశారు. ఆలయంలోని శివాలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.